క్లుప్తంగా

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మల్లు రమణారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లు వెంకటేశ్వరరెడ్డి, ఆయన కోడలు మల్లు స్వాతిరెడ్డి శుక్రవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు సత్కరించారు.

సర్పంచ్‌కు పరామర్శ



సీతారామపురం: మండలంలోని చిన్నాగంపల్లి సర్పంచ్ మునగల రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల రామచంద్రారెడ్డి తల్లి శంకరమ్మ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన నేపథ్యంలో కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, నాయకులు సోడా జనార్దన్‌రెడ్డి, బాలిసేని మాబయ్య, తదితరులు ఉన్నారు.

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

సీతారామపురం: అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక బాలత్రిపుర సుందరీదేవి యోగానంద ఆశ్రమంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ మండలాధ్యక్ష, ఉపాధ్యక్షులు ఓంకారం వెంకటేశ్వరరాజు, కప్పా సత్యనారాయణరాజు శుక్రవారం తెలిపారు. ఉదయం అయ్యప్పస్వామికి విశేషాభిషేకాలు, పడిపూజ, హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేయనున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ



అనుమసముద్రంపేట: మండలంలోని ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు సరస్వతీదేవి పూజను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్లు రమణారెడ్డి, దొరస్వామిరెడ్డి మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి



సోమశిల: అనంతసాగరం మండలం మంగుపల్లి, చిలకలమర్రి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా శుక్రవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కనీసం వేతనం రూ.300 అందేలా చర్యలు తీసుకోవాలని, వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రథమచికిత్స కిట్లు, తదితర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌టీఏ ప్రథమ వార్షిక వేడుకలు



సోమశిల: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొంది ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. నెల్లూరులో జరిగిన ఈ కార్యక్రమంలో అనంతసాగరానికి చెందిన రాష్ట్ర వైస్‌చైర్మన్ మెట్టుకూరు సుబ్బారెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలత పాల్గొని ఎమ్మెల్సీని ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు కే శివశంకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మునీర్ జాన్, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూ ఆధార్ టెన్షన్

- సొంత పట్టాలు కలిగిన వారికే నమోదుకు అవకాశం
- డీకేటీ పట్టాలు, కౌలు రైతులపై రాని స్పష్టత
- భూఆధార్ లేకుంటే పథకాలు అందవంటున్న అధికారులు
- ఈ నెల 25వ తేదీ వరకు గడువు
- వేధిస్తున్న నెట్‌వర్క్, సర్వర్ సమస్యలు
- ఆందోళనలో అన్నదాతలు



దుత్తలూరు: రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

దుత్తలూరు/అల్లూరు: ఆధార్ తరహాలో అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సొంత భూపట్టాలు కలిగిన ప్రతి రైతుకు 14 అంకెల గుర్తింపు సంఖ్యను జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుందని, ఈ నెల 25వ తేదీలోగా రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను విధిగా చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. లేనిపక్షంలో ఎలాంటి పథకాలు అందవని సెలవిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనతో రైతుసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దేశానికి రైతు వెన్నెముక అని మాటలు చెబుతూనే వారి నడ్డి విరిచే కార్యక్రమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూఆధార్‌కు సంబంధించి తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకే ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించారు. ఆ తర్వాత సొంత భూములు కలిగి పట్టాలు ఉన్నవారికి అవకాశం కల్పించారు. ప్రస్తుత రబీ పంటల కోతలు, నూర్పిళ్లు, పొగాకు సాగు పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. మరో రెండు నెలల పాటు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతుల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 25వ తేదీ వరకు మాత్రమే గడువు ఇస్తూ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సొంత భూములు కలిగి రైతులు సైతం జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉన్నారు. వారికి సమాచారం తెలియని పరిస్థితి. కొన్ని గ్రామాల్లోని రైతులకు సైతం రిజిస్ట్రేషన్ విషయం తెలియదంటే అతిశయోక్తి కాదు. అంతేకాకుండా రైతుల సంఖ్యకు తగినట్లుగా వ్యవసాయ సిబ్బంది లేకపోవడం కూడా నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

ఆందోళనలో అన్నదాతలు

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై స్పష్టత లేక కొంతమంది అసైన్డ్, డీకేటీ పట్టా భూములు కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఆరాతీస్తున్నారు. ప్రస్తుతం ఆప్షన్ ఇవ్వలేదని అధికారులు చెబుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కౌలు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని అధికారులు చెబుతుండడంతో వీరంతా తమకు పథకాలు అందుతాయో లేదోనని మీమాంసలో పడ్డారు. అలాగే దేవాదాయ, అటవీ భూములు సాగు చేసుకునేవారు యూనిక్ కార్డుల ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అన్ని రకాల రైతులకు యూనిక్ ఐడీ కార్డులను అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు రైతులు, వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ములు లేదా ఇతర పేర్లు ఉంటే ఒకరి పేరే నమోదవుతోంది. కొంతమంది రైతుల ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానమవక నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నప్పటికీ మూడుసార్లు ఓటీపీ వచ్చేందుకు సమయం తీసుకుంటుండడంతో రైతులు పనులు మానేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంటర్నెట్, సర్వర్ సమస్యలతో జాప్యం

జిల్లాలో సొంత పట్టాలు కలిగిన 1,78,000 మంది రైతులకు తొలివిడతగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు సుమారు 1,21,000 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 57వేల మందికి పైగా రైతులను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ నెల 25లోగా రైతుసేవా కేంద్రాల్లో రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సక్రమంగా రాకపోవడం, సర్వర్‌లో సమస్యలు తలెత్తడం, తదితర కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యంగా నడుస్తోంది. మరోవైపు కొంత మంది రైతులకు ఆధార్‌కు సంబంధించిన ఓటీపీలు సక్రమంగా రాకపోవడంతో నమోదులో సమస్య తలెత్తుతోంది. అయితే ఓటీపీలు రాని రైతులను ఐరిష్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.20 లక్షల మందికిపైగా రైతులకు పీఎం కిసాన్, రైతుభరోసా అందింది. ప్రస్తుతం ఈ సంఖ్య తగ్గడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందించే సమయంలో కోత పెడతాయోమోనని కౌలు, డీకేటీ పట్టాలు కలిగిన రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటనే ప్రయోజనాలు



ఆధార్ తరహాలోని రైతులకు భవిష్యత్తులో భూ ఆధార్ కార్డులు అందజేస్తారు. ఈ కార్డులు కలిగిన రైతులు ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసం రైతులు తమ భూముల వివరాలను రైతుసేవా కేంద్రాల్లో అందించి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆధార్‌కు ఓటీపీ రాని వారికి ఐరిష్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఉదయగిరి ప్రాంతంలో భూములు కలిగి వలస వెళ్లిన వారు ఉంటే బంధువుల ద్వారా సమాచారం అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

–పీ చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

ప్రతి రైతు నమోదు చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు తమ వివరాలు నమోదు చేయించుకుని విశిష్ట సంఖ్యను పొందాలి. అల్లూరు మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 70 శాతం మంది నమోదు చేసుకున్నారు. మిగిలిన రైతులు త్వరగా నమోదు చేసుకోవాలి

–వెంకటేశ్వర్లు, ఏఓ, అల్లూరు మండలం

కౌలు రైతులకు అన్యాయం



కౌలు రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేయకపోవడం అన్యాయం. గత ప్రభుత్వంలో సొంత భూమి ఉన్న వారితో పాటు కౌలు రైతులకు కూడా రైతుభరోసా అందేది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్యను మెలిక పెట్టడం, సొంత భూమి ఉన్న రైతులకే విశిష్ట సంఖ్య నమోదు చేయడమంటే కౌలురైతులను పథకాలకు దూరం చేయడమే. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయి.

–చెంతాటి కరుణాకర్, అల్లూరు

ప్రజాచైతన్య యాత్ర ప్రారంభం

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య విమర్శించారు. ఉదయగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్రను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు అరకొరగా నిధులు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తిచేయకుండా కాలయాపన చేయడం కూటమి ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు రూ.7 వేల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో కేవలం రూ.390 కోట్లు కేటాయించడం ఈ ప్రాంతవాసులను మోసగించడమేనన్నారు. ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలుగొండ, సీతారాంసాగర్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రజలు వలసలు వెళ్లకుండా నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడె రమణయ్య, పచ్చవ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మూడ్రోజుల పాటు విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య తెలిపారు.

అడుగడుగునా అంతులేని నిర్లక్ష్యం

- బ్రహ్మోత్సవాల నిర్వహణలో దేవదాయశాఖ అధికారులు వైఫల్యం
- మండిపడుతున్న భక్తులు



నిలిచిపోయిన రథోత్సవం వద్ద గుమిగూడిన భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్నవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అడుగడుగునా దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఉత్సవాల ముందు నిర్వహించే సమన్వయ కమిటీ సమావేశం నుంచి స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహణ వరకు అన్నింటిలోనూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని సైతం ఏర్పాట్ల విషయంలో అధికారులు తప్పుదోవ పట్టించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం నుంచి ఉత్సవాల ఏర్పాట్లపై దేవదాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించేవారు. వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించేవారు. ఈ దఫా సమన్వయ కమిటీ సమావేశం నుంచి ఉత్సవాల ఏర్పాట్ల వరకు కనీసం మీడియాకు సమాచారం కూడా ఇవ్వలేదు. చివరకు ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికలు, ఉత్సవాల షెడ్యూల్‌ను కూడా మీడియాకు విడుదల చేయలేదు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి కల్యాణోత్సవానికి హాజరవుతున్న విషయాన్ని కూడా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోలేదు. మీడియాకు సైతం ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, ఆటోల ద్వారా గ్రామాల్లో ప్రచారాన్ని కూడా నామమాత్రంగా నిర్వహించి మమ అనిపించారు. ఉత్సవాలకు చేసిన ఏర్పాట్లన్నీ కూడా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చొరవతో జరిగినవే తప్ప అధికారులు చేసిందేమీ లేదు. భక్తులకు చల్లటి మంచినీరు, మజ్జిగ, రద్దీకి తగిన విధంగా తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదుల, తదితర సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొక్కుబడులు, కల్యాణోత్సం సందర్భంగా సామాన్యుల అవస్థలు వర్ణణాతీతం. రెండున్నర గంటలకు పైగా కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు కనీసం వాటర్ ప్యాకెట్లు కూడా ఇవ్వలేదు. కల్యాణోత్సం తరువాత స్వామివారి తలంబ్రాల పంపిణీలోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. స్వామివారి తలంబ్రాలు అందకపోవడంపై భక్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

రథోత్సవం విషయంలోనూ...

కొండపైన ఉత్సవాల ఏర్పాట్ల విషయం నుంచే అధికారుల తప్పిదాలు బయటపడుతున్నా చక్కదిద్దుకునే దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. హనుమంతసేవ రోజు బాణసంచా పేలి ఆటో దగ్ధమైన ఘటనలో గంట వరకు ఫైరింజన్ కూడా రాలేదు. అంటే భక్తుల భద్రతలో దేవాదాయశాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఫైరింజన్ కొండ దిగువనే అందుబాటులో ఉండేది. ఈ దఫా ఇటువంటి జాగ్రత్తలు అసలు పట్టించుకోలేదు. కీలకమైన రథోత్సవం విషయంలోనూ ఇదే తప్పిదాలు చేశారు. రథం తిరిగే విషయంలో గతంలోనూ రథం ఒరిగిపోవడం వంటి పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అధికారులు అందుకు భిన్నంగా ప్రవర్తించారు. రథోత్సవానికి రథం సిద్ధంగా ఉందా..లేదా అనే విషయాన్ని కూడా పట్టించుకోలేదు. వాస్తవానికి రథోత్సవం విషయంలో ఎమ్మెల్యే ముందు నుంచి జాగ్రత్తగానే ఉన్నారు. రథం తిరిగే రోడ్ల అంచులు కూడా ముందుగానే సరిచేయించారు. రథానికి సంబంధించిన విషయంలో మాత్రం అధికారులు ఎమ్మెల్యేను కూడా తప్పుదోవ పట్టించారు. దీంతో రథం కదిలిన కొద్ది నిమిషాల్లోనే చక్రాల వద్ద సమస్య ఏర్పడి రథోత్సవం నిలిచిపోయింది. చివరకు రథోత్సవాన్ని రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

భగ్గుమంటున్న భక్తులు

దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట ప్రజలు తీవ్రస్థాయిలో భగ్గుమంటున్నారు. ఆలయ ఈఓ రాధా కృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కొండపైన ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం కూడా పెరిగిపోయిందని మండిపడుతున్నారు.

అగ్రిగోల్డ్ భూములను వైఎస్సార్‌సీపీ నేతల పరిశీలన నేడు

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కనియంపాడు రెవెన్యూ పరిధిలోని అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ చెట్ల అక్రమ నరికివేత నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు క్షేత్ర స్థాయిలో శనివారం పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొననున్నారు. అగ్రిగోల్డ్ భూములను పరిశీలించి తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. అనంతరం మీడియా, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా చేపడుతున్న కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించాలని ఉదయగిరి నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అగ్రిగోల్డ్ భూముల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే సంపదను అక్రమంగా నరికి సొమ్ము చేసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై శనివారం ఉదయం 7 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ మార్కెట్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించే ర్యాలీలో పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పరిధిలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీతారామపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటలకు 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 14 పంచాయతీల్లో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల్లో గుర్తించిన అవకతవకలను సామాజిక తనిఖీ బృందాలు చదివి వినిపించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు హాజరుకావాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు రెండు విజ్ఞప్తులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి రెండు విజ్ఞప్తులు అందినట్లు డిపో మేనేజర్ కరిమున్నీసా తెలిపారు. వింజమూరు నుంచి కలిగిరి వెళ్లే మార్గంలో బొమ్మరాజుచెరువు వద్ద ఉన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కార్యాలయం వద్ద ఆత్మకూరు–కావలి సర్వీసులు నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కార్యాలయం ప్రతినిధులు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే చేజర్ల మీదుగా పొడేరు వైపు నడిచే బస్సులు సకాలంలో నడిచేలా చూడాలని మరొకరు డీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం: ప్రభుత్వం ఉచితంగా అందించే కుట్టు శిక్షణకు మండలంలో అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగి వారు అర్హులని చెప్పారు. శిక్షణానంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మెషీన్లు అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళలు తెల్లరేషన్‌కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న రైతుమిత్ర బృందం

కలిగిరి: పొగాకుబోర్డు అధికారుల సూచనల మేరకు ఆధునిక యాజమాన్య పద్ధతులతో పొగాకు సాగు చేపడితే రైతులు లాభాలు పొందవచ్చునని కలిగిరి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కొత్తూరు, కమ్మవారిపాళెం, కావలియడవల్లి, పెద్దపాడు గ్రామాల్లో రైతుమిత్ర బృందం సభ్యులు శుక్రవారం పర్యటించారు. పొగాకు గ్రేడింగ్ పనులను పరిశీలించారు. పొగాకు రెలవడం, అల్లకం, క్యూరింగ్, గ్రేడింగ్‌పై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఐటీసీ శాస్త్రవేత శివారెడ్డి, ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ

ఉదయగిరి/కలిగిరి/సంగం/సీతారామపురం: హోలీ పండగను చిన్నారులు, యువకులు శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొంటూ సందడి చేశారు. ఉదయగిరి, వింజమూరులోని పలు వీధుల్లో చిన్నారులు రంగులు పూసుకుంటూ కేరింతలు కొడుతూ కనిపించారు. కలిగిరిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో చిన్నారులు, యువకులు హోలీ సంబరాలను జరుపుకొన్నారు. సీతారామపురం, సంగంలోనూ చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



కలిగిరిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



సంగంలో ..



సీతారామపురంలో..

డబుల్‌రోడ్డును సింగిల్‌రోడ్డుగా మార్చేశారు



డబుల్‌రోడ్డుపై సింగిల్‌రోడ్డు మాదిరిగా వేసిన ప్యాచ్‌వర్క్

అనుమసముద్రంపేట: మండలంలోని అనుమసముద్రం నుంచి హసనాపురం వరకు ఉన్న డబుల్ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు సింగిల్ రోడ్డుగా మార్చేశారు. అనుమసముద్రం–హసనాపురం డబుల్ రోడ్డు మధ్యలో దెబ్బతినగా మరమ్మతులకు ప్రభుత్వం నిధులను మంజూరు సింది. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో సింగిల్‌రోడ్డు మాదిరిగా ప్యాచ్‌వర్కు పనులు చేపట్టారు. పాతరోడ్డు కన్నా ప్యాచ్ వర్కు ఎత్తుగా ఉండడంతో వేగంగా వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

సీతారామపురం: స్థానిక బిట్–1 సచివాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉపాధి హామీ పనులపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. గతేడాది సీతారామపురం పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సిద్ధం చేసిన నివేదికను తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించగా పలువురు అభ్యంతరాలు తెలిపారు. సర్పంచ్ భాగ్యకుమారి, డీఆర్పీలు పాల్గొన్నారు.

కాజ్‌వేపై పొంచి ఉన్న ప్రమాదం



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడు–బొటికర్లపాడు మధ్యన కాజ్‌వేపై ఏర్పడిన భారీ రంధ్రం ప్రమాదాలకు నెలవుగా మారింది. వింజమూరు, దుత్తలూరు, ఆత్మకూరు, మర్రిపాడు మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. దశాబ్దకాలంగా భారీ రంధ్రాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రంధ్రం వద్ద కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు గానీ, రక్షణ కంచె గానీ ఏర్పాటు చేయలేదు. స్థానికులే ముళ్లకంప, పాతవస్త్రాలు, రాళ్లు, తదితరాలను అడ్డుపెట్టి ప్రమాద సంకేతాన్ని సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.